క్లుప్తంగా

అలరించిన భజన



భక్తి గీతాలను ఆలాపిస్తున్న కళాకారులు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న ధర్మపథం కార్యక్రమంలో భాగంగా ఆదివారం ఆలయ దక్షిణ మాఢవీధిలోని నిత్యకళావేదికపై హైదరాబాద్‌కు చెందిన విశ్వ ఆంజనేయ భజన మండలి వారు నిర్వహించిన భజన కార్యక్రమం భక్తులను అలరించింది. కార్యక్రమంలో గణపతి ప్రార్థన, లింగాష్టకం, శ్రీశైలం శివమయం, మహేశ్వర పాపవినాశ, శివశివ శంకరా, శంభో హరహర, కైలాసవాసుని, భ్రమరాంబామాతకు జయ మంగళం తదితర భక్తి గీతాలు, భజన కీర్తనలను లక్ష్మణ్, అమర్‌నాథ్, అశోక్, గోవిందు, అంజనేయులు, నరసింహాచారి, నవీన్‌కుమార్, సత్యనారాయణ తదితరులు ఆలపించారు. తబలా సహకారం యాదగిరి అందించారు.

నేడు శాకంబరి అలంకరణ

ఆత్మకూరు: స్థానిక శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరి దేవాలయంలో అమ్మవారిని ఆషాఢ మాసం సందర్భంగా సోమవారం శాకంబరి అలంకారంలో భక్తులకు దర్శనమివ్వనున్నట్లు ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు నరహరి సత్యనారాయణ, వాసవీ మహిళా మండలి అధ్యక్షురాలు జీవరత్నమ్మ తెలిపారు. ఆదివారం వారు మాట్లాడుతూ అమ్మవారికి శాకంబరి అలంకరణతో పాటు లలిత సహస్ర నామాలు, కుంకుమార్చన పూజలు జరగనున్నాయని చెప్పారు.

అంగన్‌వాడీ పోస్టులకు దరఖాస్తు చేసుకోండి

నందికొట్కూరు: నియోజకవర్గంలోని అంగన్‌వాడీ పోస్టులకు దరఖాస్తులు చేసుకోవాలని శిశు అభివృద్ధి సేవా పథకాధికారి బి.మంగావళి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. కొత్తపల్లి మండలంలోని జానాల గూడేనికి చెందిన మినీ అంగన్‌వాడీ కార్యకర్త ఎస్టీ–01 అంగన్‌వాడీ ఆయాల పోస్టు, నందికొట్కూరు–06 సెంటర్‌కు బీసీ–సీ, మల్యాల–03 సెంటర్‌కు బీసీ–ఏ, మిడుతూరు మండలంలోని సున్నంపల్లి–ఈడబ్ల్యూఎస్, మాసపేట–ఓసీ, పగిడ్యాల మండలంలోని ప్రాతకోట–4 సెంటర్ ఓసీ, లక్ష్మాపురం–01 సెంటర్ బీసీ–డీ, కొత్తపల్లి మండలంలోని గువ్వలకుంట్ల–02 సెంటర్ ఎస్సీ గ్రూప్–3 ఖాళీగా ఉన్నట్లు తెలిపారు అర్హులైన వారందరూ దరఖాస్తులు చేసుకోవాలన్నారు. మినీ అంగన్‌వాడీ కార్యకర్త పోస్టుకు, ఆయా పోస్టులకు 10వ తరగతి ఉత్తీర్ణులై ఉండాలన్నారు. 21 ఏళ్ల నుంచి 35 ఏళ్ల వరకు వయస్సు ఉండాలని, అభ్యర్థినులు తప్పనిసరిగా వివాహితురాలై, స్థానిక నివాసితురాలై ఉండాలన్నారు. ఎస్సీ, ఎస్టీ జనవాస ప్రాంతాల్లో అభ్యర్థినులు 21 ఏళ్లు నిండినవారు లేనిచో 18 ఏళ్ల వయస్సు నిండిన వారిని పరిగణలోనికి తీసుకోవడం జరుగుతుందన్నారు.


మహానందిలో కుండపోత


మహానందిలో వర్షం కురుస్తున్న దృశ్యం

మహానంది: మండల పరిధిలో ఆదివారం రాత్రి గాలి బీభత్సంగా వీచింది. గాలి అనంతరం మహానంది ఆలయ పరిసరాలతో పాటు సమీప గ్రామాల్లో కుండపోత వర్షం కురిసింది. క్షేత్రంలోని మాడవీధుల వెంట గాలి సమయంలో దుమ్ము, ధూళి లేయడంతో భక్తులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అనంతరం భారీగా వర్షం కురవడంతో తడవకుండా ఉండేందుకు పరుగులు తీశారు. వర్షానికి ముందు మహానంది క్షేత్ర పరిసరాల్లోని ఆకాశంలో మబ్బులు కమ్ముకున్న దృశ్యం ప్రకృతి ప్రేమికులను కట్టిపడేసింది.

మహానందిలో భక్తుల సందడి

మహానంది: క్షేత్రంలో ఆదివారం భక్తుల సందడి నెలకొంది. సెలవు రోజు కావడంతో వేలాది సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ఆలయానికి వచ్చిన భక్తులు ముందుగా కోనేరుల్లో పుణ్యస్నానాలు ఆచరించి శ్రీ కామేశ్వరీదేవి, శ్రీ మహానందీశ్వరస్వామి వార్లను దర్శించుకున్నారు. ఉచిత, శీఘ్రదర్శనం, అభిషేకం, క్షీరాభిషేకం, మహదాశీర్వచనం ఆర్జిత సేవాటికెట్లతో భక్తులు స్వామి, అమ్మవారిని దర్శించుకుని తరించారు. ఉదయం స్థానిక అలంకార మండపంలో శ్రీ గంగ, శ్రీ కామేశ్వరీదేవి సహిత మహానందీశ్వరస్వామి దంపతులకు కల్యాణోత్సవం కమనీయంగా సాగింది. పలు ప్రాంతాల భక్తులు ప్రత్యక్షంగా, పరోక్షంగా కల్యాణోత్సవాన్ని కనులారా తిలకించి స్వామి, అమ్మవారి ప్రసాదాలు స్వీకరించారు.


చిన్న కోనేరులో భక్తుల కోలాహలం

పంటల పాలిట శత్రువు..
వయ్యారిభామ!

- కలుపు మొక్కతో పంటకు నష్టం
- జీవరాశికీ ప్రమాదమే
- పూతకు ముందే తొలగించాలి

బండిఆత్మకూరు : రైతులు తెగుళ్ల కంటే అధికంగా భయపడేది వయ్యారిభామ (పార్థీనియం) కలుపు మొక్కకే. ఎక్కడైనా పెరగడం ఈ మొక్క లక్షణం. ఈ కలుపు మొక్క ప్రధాన పంటకు నష్టం కలిగిస్తుంది. మొలిచిన నెల రోజుల్లోనే పూతకు వస్తుంది. ఒక్కో మొక్క 50 వేల విత్తనాలను ఉత్పత్తి చేయడంతో పాటు గాలి పాటుకు దూర ప్రాంతాలకు సైతం తేలికగా విస్తరిస్తుంది. ఈ కలుపు మొక్క గురించి మండల వ్యవసాయాధికారి పవన్‌కుమార్ తెలిపిన వివరాలు..


వయ్యారిభామ మొక్కలు

జీవరాశికీ ప్రమాదమే..

వయ్యారిభామ వల్ల పంటలకే కాదు మనుషులు, పశువులకూ ముప్పే. మనుషులకు జ్వరం, ఉబ్బసం వంటి వ్యాధులతో పాటు చర్మ సంబంధిత అలర్జీ వస్తుంది. జలుబు, కళ్లు ఎర్రబడ డం, కనురెప్పల వాపు తదితర సమస్యలు వస్తాయి. ఈ మొక్కలను తింటే పశువులు అయితే హైపర్‌టెన్షన్‌కు గురవుతాయి. ఇక పంటలకు నీరు, పోషకాలు అందకుండా వాటి కన్నా ముందుగా ఇవే శోషించుకుంటాయి. తద్వారా దిగుబడులు 40 శాతం వరకు తగ్గుతాయి. వంగ, మిరప, టమాట, మొక్కజొన్న పైర్లు పూత దశలో ఉన్నప్పుడు వాటిపై వయ్యారిభామ పుప్పొడి పడితే ఉత్పత్తి తగ్గుతుంది. పైర్లకు మొవ్వ, కాండం కుళ్లు తెగుళ్లు సోకే ప్రమాదముంది. ఈ మొక్కలు పశుగ్రాస పంటలకు కూడా నష్టం కలిగిస్తాయి. ఈ మొక్కల్ని నిర్మూలించాలంటే రైతులు తప్పనిసరిగా సమగ్ర యాజమాన్య, సస్యరక్షణ చర్యలు చేపట్టాలి.

ఇలా తొలగించాలి..

వయ్యారిభామ మొక్కలు తక్కువ సంఖ్యలో ఉంటే చేతితో పీకేయాలి. మొక్కలు పూతదశకు రాకముందే పీకి తగలబెట్టాలి. లేకపోతే వాటి వ్యాప్తిని నివారించడం కష్టం. ఒకవేళ పూత దశకు చేరుకున్న తర్వాత మొక్కలను పీకినట్లయితే వాటిని వెంటనే కుప్పగా వేసి తగలబెట్టాలి.

రసాయనాలతో..

మొక్కజొన్న, జొన్న, చిరుధాన్యాల పంటల్లో విత్తనాలు మొలక రాకముందు లీటరు నీటికి 4 గ్రాముల చొప్పున అట్రాజిన్ కలిపి పిచికారీ చేస్తే వయ్యారిభామ మొక్కల బెడద ఉండదు. విత్తనాలు మొలకెత్తిన 15–20 రోజులకు లీటరు నీటికి 2 ఎం ఎల్ పేరాక్వాట్ మందును కలిపి పిచికారీ చేసుకోవచ్చు.

పశుగ్రాసం వేసేవారు పైరు వేయకముందే లీటరు నీటికి 5 గ్రాముల చొప్పున అట్రాజిన్ కలిపి పిచికారీ చేయాలి.

కంపోస్ట్ తయారీ..

వయ్యారిభామ మొక్కలు ఎంతో హానికరమైనప్పటికీ వాటిని ఉపయోగించి కంపోస్ట్ తయారు చేసుకోవచ్చు. ఇందుకు నీరు నిలవని చోట 3 మీటర్ల లోతు, 6 మీటర్ల వెడల్పు, 10 మీటర్ల పొడవు ఉండేలా గుంత తవ్వాలి. ఇందులో 50 కిలోల వయ్యారిభామ మొక్కలను వేసి, వాటిపై 5 కిలోల యూరియా, 50 గ్రాముల ట్రైకోడెర్మావిరిడి కూడా చల్లాలి. ఈ విధంగా పొరలు, పొరలుగా గుంతను డోము ఆకారంలో నింపుకోవాలి. పొరల పైన పేడ, మట్టి, ఊక మిశ్రమాన్ని వేసి కప్పేయాలి. నాలుగైదు నెలల్లో కంపోస్ట్ తయారవుతుంది. దానిని జల్లెడ పట్టి పంటకు వేసుకోవాలి. ఈ కంపోస్టులో నత్రజని, భాస్వరం, పొటాషియం, కాల్షియం, మెగ్నీషియం పోషకాలు అధికంగా ఉంటాయి. ఇలా తక్కువ ఖర్చుతో తయారు చేసుకుని అన్ని పంటలకు వేసుకోవచ్చు.

సిద్ధాపురంలో కార్డెన్ సెర్చ్


తనిఖీలు నిర్వహిస్తున్న సీఐ రాము

ఆత్మకూరు: మండలంలోని సిద్ధాపురం గ్రామంలో ఆదివారం ఆత్మకూరు సీఐ రాము ఆధ్వర్యంలో పోలీసులు కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జిల్లాలో అక్రమ ఆయుధాలు నిల్వ ఉంచుకున్న, ప్రధానంగా నాటుసారా తయారు చేసినా, విక్రయించినా నేరమన్నారు. సారాను తయారు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం గ్రామంలోని అనుమానితుల గృహాల్లో తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా గ్రామంలో 21 క్వార్టర్ బాటిళ్లను స్వాధీనం చేసుకొని ధ్వంసం చేశారు. అలాగే డివిజన్‌లో ధ్రువపత్రాలు లేని 40 బైక్‌లను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఆత్మకూరు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామీణ ప్రాంత విద్యార్థుల అభివృద్ధే లక్ష్యం


మాట్లాడుతున్న పూర్వ విద్యార్థుల సంఘం కోశాధికారి అచ్యుతరావు

పాములపాడు: గ్రామీణప్రాంత విద్యార్థుల విద్యాభివృద్ధే తమ లక్ష్యమని పూర్వ విద్యార్థుల సంఘం కోశాధికారి అచ్యుతరావు అన్నారు. ఆదివారం స్థానిక ఏఎస్ఆర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పూర్వ విద్యార్థుల వార్షిక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిటీ అధ్యక్షుడు నాగేంద్రాచారి, కార్యదర్శి చల్లా జయశంకర్‌రెడ్డి మాట్లాడుతూ ఆగస్టు 15న స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని 10వ తరగతిలో అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు ప్రోత్సాహకంగా ప్రథమ, ద్వితీయ, తృతీయ నగదు బహుమతులు రూ.15,000, రూ.10,000, రూ. 5,000 అందజేయనున్నట్లు తెలిపారు. అలాగే ప్రస్తుతం ఉన్న కార్యవర్గాన్ని రద్దు పరిచి నూతన కార్యవర్గాన్ని ఎంపిక చేయాలని నిర్ణయించారు.

పోతిరెడ్డిపాడు గేట్లు ఎత్తకపోతే మేమే ఎత్తుతాం



సమావేశంలో రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రాజశేఖర్

నందికొట్కూరు: పోతిరెడ్డిపాడు గేట్ల నుంచి జూలై రెండోవ తేదీన నీటిని విడుదల చేయకపోతలే రైతు సంఘం ఆధ్వర్యంలో గేట్లు ఎత్తుతామని ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రాజశేఖర్ హెచ్చరించారు. ఆదివారం పట్టణంలోని సీపీఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కర్ణాటక, మహారాష్ట్ర రెండు రాష్ట్రాల్లో ముందస్తు వర్షాలు కురవడంతో శ్రీశైలం ప్రాజెక్టులో 865 అడుగులకు నీటి మట్టం చేరిందని గుర్తు చేశారు. రాయలసీమ రైతాంగానికి సాగు, తాగు నీరు అందించేందుకు కూటమి ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పోతిరెడ్డిపాడు గేట్లు ఎత్తి రైతులకు సాగు నీరు ఇవ్వకపోతే రైతు సంఘాలను సమీకరించి జూలై మూడోవ తేదీన గేట్లు ఎత్తుతామని స్పష్టం చేశారు. సుంకేసుల డ్యాం నుంచి కేసీ కెనాల్‌కు నీటిని విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ముందస్తు వర్షాలు కురవడంతో నియోజకవర్గంలో మొక్కజొన్న పంట, వరి, ఉల్లి పంటలను రైతులు సాగు చేశారని తెలిపారు. వర్షాలు కురవక పంటలు ఎడిపోతున్నాయని, కూటమి ప్రభుత్వం స్పందించి సాగునీరు అందించాలని కోరారు. సమావేశంలో ఆ సంఘం నాయకులు నాగేశ్వరావు, వెంకటేశ్వరరావు, ఉస్మాన్ బాషా తదితరులు పాల్గొన్నారు.


ఉత్తరద్వార గోపురంపైన మొలిచిన మొక్కలు,


అలంకార మండపంపైన మొక్క

మొక్కే కదా అని వదిలేస్తే!

మొక్కే కదా అని వదిలేస్తే పెరిగి పెద్దవై గోపురాలకు ముప్పుగా మారతాయి. క్షేత్రంలోని ఉత్తర గాలిగోపురం, అలంకార మండపం, దక్షిణ గాలిగోపురం తదితర వాటిపై రావి, వేప, బసరి తదితర మొక్కలు మొలుస్తున్నాయి. మొక్క దశలోనే వాటిని తొలగిస్తే గోపురాలు భద్రంగా ఉంటాయి. ఏమాత్రం నిర్లక్ష్యం చేసినా పెరిగి గోపురాల మనుగడకు ముప్పుగా పరిణమిస్తాయి. అధికారులు స్పందించి ఆ మొక్కలను తొలగించాలని భక్తులు కోరుతున్నారు. – మహానంది

తొందరపడి పైర్లను దున్నేయకండి


మొక్కజొన్న పైరును పరిశీలించి రైతులకు సూచనలిస్తున్న వ్యవసాయ అధికారులు

పాములపాడు: మొక్కజొన్న పైర్లు ఎండబారుతున్నాయని తొందరపడి దున్నేయ్యొద్దని జిల్లా వ్యవసాయాధికారి వెంకటేశ్వర్లు అన్నారు. ఆదివారం ‘సాక్షి’లో ప్రచురితమైన ‘మొక్కజొన్న రైతుకు ఆదిలోనే హంసపాదు’ అనే కథనం కథనంపై స్పందించిన వ్యవసాయాధికారులు ఆదివారం పాములపాడు మండలం చేరుకున్నారు. స్థానిక మండల వ్యవసాయాధికారి కార్యాలయంలో రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ ప్రాంతంలో ఏ రకమైన భూములున్నాయని అడిగారు. ఇప్పటికే 35 రోజులు పైరు దాటిందని, ఇక దిగుబడి అంతంత మాత్రంగానే ఉంటుందని అందువల్లే దున్నేశామని రైతులు డీఏఓకు తెలిపారు. ఈ విషయంపై ఆయన స్పందిస్తూ వర్షాలు తప్పని సరిగా కురుస్తాయని, ఇప్పటికే మండలంలో 34మిల్లీ మీటర్ల వర్షపాతం కురిసిందని తెలిపారు. వర్షాలు పడే వరకు పైర్లకు ఎరువులు వేయవద్దని సూచించారు. ప్రస్తుతం పైరు చెడగొట్టడం వలన రైతుకు నష్టమే తప్పా ఉపయోగం ఉండదన్నారు. అందువల్ల ఎండబెట్టతో ఉన్న పైరుకు నానో యూరియా, పొటాషియం నైట్రేట్ పిచికారి చేయడం వల్ల మొక్కకు అదనపు బలాన్నిస్తుందన్నారు. ఎండబెట్ట నుంచి కాపాడుకోవచ్చని వివరించారు. వర్షాధారం పైనే ఆధారపడి చేసే వ్యవసాయం రిస్క్‌తో కూడుకున్నదని, ఆందోళన చెందాల్సిన పని లేదన్నారు. సోయాబిన్ సబ్సిడీ విత్తనాలు కావాలని రైతులు కోరగా అందిస్తామని చెప్పారు. అనంతరం మొక్కజొన్న పైరున్న పొలానికి వెళ్లి నానో యూరియా పిచికారీ చేయించారు. ఆయన వెంట మండలవ్యవసాయాధికారులు మహేశ్వరరెడ్డి, టెక్నికల్ ఏఓ ఆయూబ్ బాష తదితరులు ఉన్నారు.

జాతీయ గణాంక దినోత్సవం

ఆత్మకూరు: పట్టణంలోని రెవెన్యూ డివిజన్ కార్యాలయంలో ఆదివారం జాతీయ గణాంక దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్డీఓ నాగజ్యోతి మాట్లాడుతూ ప్రభుత్వ పాలనలో గణాంకాలకు ఎంతో ప్రాధాన్యత ఉందని చెప్పారు. సమాజంలో ప్రతి మార్పుకు గణాంకాలే కారణమన్నారు. అభివృద్ధి ప్రణాళిక, సంక్షేమ కార్యక్రమాలు, వనరుల వినియోగం లాంటి కార్యక్రమాలకు గణాంకాలే ముఖ్యమన్నారు. గణాంకాల మూలపురుషుడు ప్రశాంత్ చంద్ర మహల్ నోబిస్ స్థాపించిన గణాంక శాస్త్రం ఎంతో ప్రసిద్ధి చెందిందని వివరించారు. కార్యాలయ పాలన అధికారి శ్రీనివాసులు, మద్దూరు నాగరాజు, పాల్, అరుణాదేవి, విమల పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారంలో ప్రభుత్వాలు విఫలం

ఆత్మకూరు: ప్రజాసమస్యల పరిష్కారంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు యేసురత్నం, పట్టణ కార్యదర్శి రణధీర్ పేర్కొన్నారు. పట్టణంలోని సుదర్శన భవనంలో సోమవారం జరిగిన కార్యకర్తల సమావేశంలో వారు మాట్లాడుతూ కేంద్రంలోని మోదీ ప్రభుత్వం ప్రజలను ధనవంతులు చేస్తున్నామని ప్రపంచ బ్యాంకు షరతులకు లొంగి తప్పుడు నిర్ణయాలు తీసుకుంటుందని ఆరోపించారు. కార్పొరేట్ శక్తులకు కొమ్ము కాస్తూ దేశ అభివృద్ధిని కాలరాస్తుందని మండిపడ్డారు. 11 సంవత్సరాల మోదీ పాలనలో ఎన్ని ఉద్యోగాలు ఇచ్చారో తెలపాలని డిమాండ్ చేశారు. ఇక రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ పథకాలు ఎంత మేర అమలు చేశారో చెప్పాలన్నారు. నాయకులు మంజుల, రామ్‌నాయక్, సురేంద్ర, నాగేశ్వర్‌రావు, భాస్కర్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయినికి సన్మానం


సౌభాగ్యమ్మ దంపతులను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

వెలుగోడు: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పని చేస్తున్న ఉపాధ్యాయురాలు సౌభాగ్యమ్మ ఆదివారం పదవీ విరమణ పొందారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సన్మాన కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం సత్యనారాయణ హెగ్డే అధ్యక్షతన ఆమెను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పలువురు ప్రముఖులు ఆమె సేవలను కొనియాడారు. అలాగే పూర్వ విద్యార్థుల సంఘం తరఫున అధ్యక్ష, కార్యదర్శులు రామలింగారెడ్డి, మక్బుల్, పలువురు పూర్వ విద్యార్థులు ఆమెను సన్మానించారు. వక్తలు మాట్లాడుతూ.. 35ఏళ్ల పాటు మండలంలో ఉపాధ్యాయినిగా పని చేసి ఎంతో మందిని ప్రయోజకులను చేసిందన్నారు. వెలుగోడు మేజర్ గ్రామ పంచాయతీ సర్పంచ్ వేల్పుల జైపాల్, ఎంపీపీ లాలం రమేష్, ఎంఈఓ బ్రహ్మం నాయక్, మాజీ ఎంపీపీ సీతమ్మ, రిటైర్డ్ హెచ్‌ఎం లు అబ్దుల్ అజీజ్, వర్మ పాఠశాలల అధినేత వర్మ , రాజేశ్వరి, రూత్, మాజీ సర్పంచ్ అల్లే తిరుపాల్ రెడ్డి, రైతు సంఘం జిల్లా నాయకుడు యాదాటి నాగేంద్రుడు తదితరులు పాల్గొన్నారు.

సూపర్‌సిక్స్ పథకాల అమలులో విఫలం


మాట్లాడుతున్న సీపీఐ మండల కార్యదర్శి అబ్దుల్‌మజీద్

పగిడ్యాల: సూపర్ పథకాల అమలులో కూటమి ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని సీపీఐ మండల కార్యదర్శి అబ్దుల్ మజీద్ అన్నారు. ఆదివారం స్థానిక సీపీఐ కార్యాలయంలో మండలశాఖ సమావేశాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ 2024 సార్వత్రిక ఎన్నికల్లో బీజేపీ, టీడీపీ, జనసేన పార్టీలు కూటమిగా ఏర్పడి ప్రజలకు సూపర్‌సిక్స్ పథకాలు అమలు చేస్తామని నమ్మబలికారన్నారు. అధికారంలోకి రాగానే వాటిని అమలు చేయకుండా కాలయాపన చేస్తున్నారని విమర్శించారు. ఏడాదిపాలన పూర్తైనా ఒక్క పథకాన్ని కూడా సక్రమంగా అమలు చేసిన దాఖలా ల్లేవన్నారు. నిరుద్యోగభృతి కింద నెలకు రూ.3వేలు ఇస్తామని నిరుద్యోగులను మోసగించారన్నారు. 18 ఏళ్ల పైబడిన ప్రతి మహిళకు నెలకు రూ.1,500లు ఇస్తామని చెప్పి మొండిచెయ్యి చూపించారని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో గౌండ శాలు మియ్య, షబ్బీర్‌ఖాన్, రామలింగం, ముర్తుజావలి, అబ్దుల్‌రహిమాన్, అమీద్‌బాషా పాల్గొన్నారు.

మహానంది ఆలయ తనిఖీ అధికారిగా డీసీ

- రేపు క్షేత్రానికి రానున్న అధికారి

మహానంది: రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ప్రధాన దేవాలయాలతో పాటు డిప్యూటీ కమిషనర్, అసిస్టెంట్ కమిషనర్ హోదా కలిగిన ఆలయాల్లో భక్తులకు కల్పిస్తున్న సౌకర్యాలు, జరుగుతున్న అభివృద్ధి పనులపై దేవదాయ శాఖ ప్రత్యేక దృష్టి సారించింది. ఈ మేరకు రాష్ట్ర దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి, కమిషనర్ రామచంద్రమోహన్ ఆదేశాల మేరకు రాష్ట్రంలోని ప్రతి దేవాలయానికి ఒక ప్రత్యేక అధికారిని నియమించినట్లు ఆ శాఖ ప్రధాన కార్యాలయ వర్గాలు తెలిపాయి. అందులో భాగంగా మహానంది ఆలయానికి ఉమ్మడి జిల్లాల డిప్యూటీ కమిషనర్ గురు ప్రసాద్‌ను నియమించినట్లు తెలిసింది. దీంతో ఆయన మంగళవారం మహానంది ఆలయానికి వస్తున్నట్లు సమాచారం. ఆలయంలో జరుగుతున్న అభివృద్ధి పనులతో పాటు భక్తులకు కల్పిస్తున్న సౌకర్యాలు, ఆర్జిత సేవలు, వసతిగృహాల సౌకర్యం, అన్నప్రసాద వితరణ, షాపుల వివరాలు..తదితర వాటిపై తనిఖీ చేయనున్నారని తెలిసింది. ఇప్పటికే అప్రమత్తమైన అధికారులు ఆలయ ప్రాంగణంలో టెండరుదారులు భక్తులకు అందించే వస్తువుల ధరల వివరాలు, పాదరక్షలు, సెల్‌ఫోన్ లాకర్ల రుసుములపై ఎప్పటికప్పుడు మైకుల్లో అనౌన్స్ చేయిస్తున్నారు.

తాటిపాడు ఫీల్డ్ అసిస్టెంట్ తొలగింపు

జూపాడుబంగ్లా: 16వ విడత సామాజిక తనిఖీలో జరిగిన అవకతవకలకు తాటిపాడు ఫీల్డ్‌అసిస్టెంట్ కె.చిన్నలింగన్నను బాధ్యునిగా చేస్తూ విధుల నుంచి శాశ్వతంగా తొలగిస్తున్నట్లు జిల్లా నీటియాజమాన్యం సంస్థ పీడీ సూర్యనారాయణ ఉత్తర్వులు జారీచేసినట్లు ఆదివారం ఎంపీడీఓ గోపికృష్ణ తెలిపారు. 2023 ఫిబ్రవరి 3న నిర్వహించిన మండల స్థాయి సామాజిక తనిఖీ బహిరంగ సభలో తాటిపాడు గ్రామానికి చెందిన వీఆర్ఏ, ఆశా వర్కర్లకు ఉపాధి హామీ పథకంలో పనులు కల్పించి వారికి రూ.10,682 చెల్లించినట్లు సోషల్ ఆడిట్ బృందం బహిర్గతం చేశారు. ఈ మొత్తాన్ని చిన్నలింగన్న నుంచి రికవరీ చేయాలని అప్పట్లో జిల్లా అధికారులు ఆదేశించారు. ఆ మేరకు నిర్ణీత మొత్తాన్ని చిన్నలింగన్న చెల్లించాడు. ఈ విషయమై గతేడాది ఓ పర్యాయం అతన్ని తాత్కాలికంగా సస్పెండ్ చేశారు. దీంతో హైకోర్టును ఆశ్రయించి తనపై విధించిన తాత్కాలిక తొలగింపును రద్దు చేయించుకొని విధుల్లో చేరారు. అయినప్పటికీ అతన్ని ఎలాగైనా విధుల్లోంచి తొలగించాలనే ధోరణి కొనసాగుతూనే ఉంది. ఈ నేపథ్యంలో పాతవాటినే సాకుగా చూపి తొలగిస్తున్నట్లు పీడీ ఉత్తర్వులు జారీ చేయటం గమనార్హం. విధుల నుంచి శాశ్వతంగా తొలగిస్తున్నట్లు ఉత్తర్వులు జారీ చేసినప్పటి నుంచి 30 రోజుల్లోగా జిల్లా కలెక్టర్‌కు అప్పీలు చేసుకోవచ్చునని పేర్కొన్నట్లు తెలిపారు. ఇదిలా ఉంటే మండలంలోని భాస్కరాపురం గ్రామానికి చెందిన ఫీల్డ్‌అసిస్టెంట్‌ను కూడా తొలగించాలని కూటమి నేతలు విశ్వ ప్రయత్నం చేస్తున్నట్లు సమాచారం.


పచ్చని అందాల మధ్య ఓంకార క్షేత్రం,(ఇన్‌సెట్)ఓంకారేశ్వరుడు

ప్రకృతి ఒడిలో ఓంకారేశ్వరుడు

మండలంలోని నల్లమల అడవిలో ఎత్తైన కొండలు, భారీ వృక్షాల మధ్య ఓకాంర క్షేత్రం అలరారుతోంది. ఇక్కడి వచ్చే భక్తులు, ప్రకృతి ప్రేమికులు చుట్టూ ఉన్న పచ్చందాలతో మైమరచిపోతారు. ఓంకారేశ్వరుని క్షేత్రం భక్తుల మనశ్శాంతికి పెన్నిధి... భక్తుల కోరికలను తీర్చే దైవంగా ప్రసిద్ధి గాంచిన శ్రీ గంగా ఉమా సమేత స్వామి వార్లను ఆది,సోమవారాల్లో సుదూర ప్రాంతాల నుంచి భక్తులు భారీగా తరలివచ్చి దర్శించుకుంటారు.

– బండి ఆత్మకూరు


ప్రత్యేక ఆకర్షణగా పంచబుగ్గల కోనేరు,(ఇన్‌సెట్) క్షేత్రంలో భారీ వృక్షాలు